◆ మినీకథ

# హీరో క్రేజ్



– ఎ. గోదావరమ్మ

ఆ రోజు ఆదివారం అవడం వలన శ్రీవారికి, పిల్లలకి సెలవు. అంచేత లేటుగా లేస్తారు. కాఫీ తాగుదామని పాలు స్టౌమీద పెట్టి, నెస్‌కాఫీ సీసా తీసేను. ఇంతలో శ్రీవారి మాటలు వినిపించేయి– "ఒరే గిరీ, హరీ, ఇలారండి, ఈ రోజు ఇంట్లో వంట వద్దని 10 గం.లకి సినిమాకి వెళ్దాం, తర్వాత హోటల్లో భోంచేసి యింటికొద్దాం. మళ్ళీ సాయంత్రం ఏం సినిమా చూద్దాంరా బాబూ?" అని చిన్నవాడ్ని ముద్దుగా అడిగారు.

"అమితాబ్ బచ్చన్ సినిమా" అని వాడు ఇంకా ముద్దుగా గునిసేడు. ఈ సంభాషణంతా వింటూ ఆలోచిస్తున్నాను. అసలే నెలాఖరు రోజులు. సినిమాలు, హోటళ్లు– ఇదంతా అనవసరమైన ఖర్చు– అనుకుంటూ హాల్లోకొచ్చేసరికి శ్రీవారు ముఖం తుడుచుకుంటూ వస్తున్నారు. కాఫీ గ్లాసు చేతికందిచ్చి, "ఎందుకండీ అనవసరమైన ఖర్చు. మన ఇంట్లో మొన్న కొన్న కూలీ కేసెట్ వుంది కదా, ఇంట్లో వి.సి.ఆర్ వుంది కదా, తొందరగా భోంచేసి అది చూద్దాం. 12 గం.లకి మొదలెడ్తే మూడు గంటలకి అయిపోతుంది. తర్వాత పిల్లలు హోంవర్క్ చేసుకుంటారు" అన్నాను.

చిన్నవాడు కూలీ సినిమా అనగానే సంతోషంతో బొంగరంలా గిరగిరా తిరుగుతూ, 'దునియాకీ మోజు ఉఠాతా హు' అని కూలీలో పాట పాడడం మొదలెట్టేడు. వాళ్ళ నాన్నగారికి కోపం ఎక్కువ. "ఒరే గిరీ మోజు కాదురా, బోజ్. నాలుగు సంవత్సరాలైనా సరిగా మాట్లాడ్డం రాదు. వాడికి తెలీకపోతే నువ్వైనా చెప్పరాదా" అంటూ నామీద విసుక్కున్నారు.

"బాగానే వుంది మీ కోపం! ఉరుము వురిమి మంగలం మీద పడ్డట్టు. వాడు తప్పులు మాట్లాడితే మీరు దిద్దవచ్చుకదా. అయినా ఆడపిల్లల తప్పులు తల్లి దిద్దాలి, మగ పిల్లల తప్పులు తండ్రి దిద్దాలి. నాకాడ పిల్లలు లేరు కాబట్టి ఆ వూచీ నాకు లేదు" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయాను.

భోజనాలయ్యాక పిక్చరు మొదలెట్టేము. హరి బుద్ధిగా కూర్చుని సినిమా చూస్తున్నాడు. వాడికి వాళ్ళనాన్న దగ్గర భయం. గిరి చిన్నవాడవడంచేత ముద్దు లావై కోరి కోరి ముద్దు మాటలాడుతుంటాడు. సినిమా చూస్తూ మావారు. పిల్లలు ఒకటే గోల. "కాసేపు ఆపండి. టీ చేసి తెస్తా.. తలనొప్పిగా వుంది అన్నా.

వంటింట్లోకి వెళ్ళి కెటిల్, కప్పులు కడిగి టీ చేసి పోసేను. పిల్లలకి పాలు రెడీ చేసి బిస్కెట్లు తీస్తుండగా– అప్పుడు వినిపించింది. చెవులు చిల్లులు పడే కేక! ఆ కేక మా చిన్నవాడిదని తెలిసి పెరట్లోకి పరిగెత్తాను. అక్కడ కనబడిన దృశ్యంతో, ఇంతసేపూ సినిమా చూసిన సంతోషం నీరుగారిపోయింది. చిన్నవాడు మట్టిలో కూర్చొని ఏడుస్తున్నాడు. పెద్దవాడు వాడిని శక్తికొద్దీ లేవదియ్యడానికి ప్రయత్నిస్తున్నాడు. వీడు లేవదీస్తున్న కొద్ది వాడు ఇంకా ఏడుస్తున్నాడు.

"ఎందుకు నాన్నా గిరీ, ఏడుస్తున్నావు? ఏమయింది, దెబ్బ తగిలిందా, ఏదీ, చూడనీ, రా మందు రాస్తాను దా, పాలు తాగుదువుగానీ" అని వాడ్ని అనునయిస్తూ, లేవదియ్యబోయాను. వాడు మళ్ళీ 'కయ్యి మని అరిచి గిలగిలా తన్నుకున్నాడు. "ఏమయిందిరా హరీ, ఇద్దరూ కొట్టుకున్నారా? ఎందుకేడుస్తున్నాడని పెద్దవాడ్ని అడిగా, అది కాదమ్మా, మరేమో నేనూ, గిరీ గార్డెన్‌లో ఆడుకుందామని వచ్చాము. అప్పుడు వీడు 'అన్నా నేను చూడు అమితాబ్‌బచ్చన్‌లా ఫైటింగ్ చేస్తా' నంటూ నీళ్ళ టాంక్ మీద కెక్కి అక్కడ్నించి దూకేడమ్మా! నేను వద్దన్నా వినలేదమ్మా" అంటూ భయంగా చూసేడు.

ఇంతలో వాళ్ళ నాన్నగారు వస్తూ, "రండిరా, సినిమా చూద్దాం" అంటూ గిరివైపు చూసి "ఏమైంది వీడికి" అన్నారు. "వీడు నీళ్ళటాంకు మీదకెక్కి గెంతేడుట. చూద్దామంటే ముట్టుకోనివ్వడంలేదు" అన్నాను. తను వాడ్ని బలవంతంగా లేవనెత్తబోతే వాడు మళ్ళీ ఏడుపులంకించుకున్నాడు. "ఫ్రాక్చరైందో ఏమిటో! నువ్వు వీడికి ముఖం కడిగి బట్టలు మార్చు. హాస్పిటల్‌కి వెళ్దాం. నువ్వూ వాడూ రిక్షాలో రండి. నేను హరి స్కూటరు మీద వస్తాం" అని వెళ్ళేరు.

"ఇదేం ఖర్మరా బాబూ. ఇప్పటి వరకు నిక్షేపంలా వున్నావు. ఇప్పుడేం ఖర్మ" అన్నా గిరికి బట్టలు మారుస్తూ" మరేం ఫర్వాలేదమ్మా. అమితాబ్‌బచ్చన్‌కి బాగైపోయిందిగా– కూలీలో. నాకూ అలాగే బాగైపోతుంది" అన్నాడు– అంత బాధలోనూ. మావాడి హీరో క్రేజ్‌కి జాలివేసింది. ఇంతలో రిక్షా తీసుకొని మావారు రావడమూ మేము హాస్పిటల్‌కి వెళ్ళడమూ, మా వాడికి ఎక్స్‌రే తీసి డాక్టరు కాలుఫ్రాక్చరైందని చెప్పడమూ జరిగాయి. ప్లాస్టరు వేయించి యింటికి వచ్చేసరికి ఆరు గంటలయింది.

గిరిని మంచంమీద పడుకోబెట్టి పక్కన కూర్చున్నాను. "నొప్పిగా ఉందా నాన్నా, పడుకో తగ్గిపోతుంది" అన్నా. వాడు 'అమ్మా. కూలీ సినిమా' అన్నాడు టి.వి వైపు చూపిస్తూ. ఇంతలో ఏమంటున్నాడు నీ సుపుత్రుడు?" అంటూ వాళ్ళ నాన్నగారు వచ్చారు. "ఏముందీ, అమితాబ్‌బచ్చన్‌కి బాగైంది కనుక తనకీ బాగైపోతుందిట" అన్నా.

"అమితాబ్ బచ్చన్‌కి దెబ్బ తగిలితే లక్షలు, కోట్లు ఖర్చుపెట్టి బాగు చేయించుకోగల తాహతుంది. మనకేముంది? డాక్టరు బిల్లు అయిదొందలు ఇచ్చుకునే సరికి అయింది నాపని. అయినా సినిమాల్లో చూసిన వన్నీ మనం చేస్తామంటే ఎలాగరా? ఆ సినిమాలో ఫైట్స్ అన్నీ నిజం అనుకుంటున్నారా? అది నిజం అనిపించేలా తియ్యడమే, అలా వెయ్యడమే వాళ్ళ గొప్ప. ఇలా అమితాబ్‌బచ్చన్ చేసిన ప్రతీపని చేస్తానంటే నిన్నింక ఎప్పుడూ సినిమాకు తీసుకెళ్ళను" అంటూ విసుగ్గా బయటకు నడిచారు మావారు. ■